క్లుప్తంగా

వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజుకు పరామర్శ



సర్పంచ్ నూకరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్, ప్రసాద్

మునగపాక: మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజును గురువారం మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పరామర్శించారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను వాడ్రాపల్లిలోని తన నివాసంలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి అమర్‌నాథ్ పరామర్శించారు. అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకుంటూ వేగంగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, అనకాపల్లి, యలమంచిలి ఎంపీపీలు గొర్లి సూరిబాబు, బోదెపు గోవింద్, పార్టీ నాయకులు నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల జగన్, పిన్నమరాజు రవీంద్రరాజు, మద్దాల వీరునాయుడు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

మునగపాక పోలీస్‌స్టేషన్ సందర్శన

మునగపాక: మునగపాక పోలీస్‌స్టేషన్‌ను గురువారం సాయంత్రం పరవాడ డీఎస్పీ సత్యనారాయణ సందర్శించారు. స్టేషన్ తనిఖీలో భాగంగా రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐ ప్రసాదరావును అడిగి తెలుసుకున్నారు. సంక్రాంతి పండగలో భాగంగా అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూడాలని, గంజాయి నిర్మూలనపై దృష్టి సారించాలని డీఎస్పీ సూచించారు.

మొదటి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



మొదటి సెమిస్టర్ పరీక్షలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: అటానమస్ హోదా పొందిన తర్వాత యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరం డిగ్రీ మొదటి సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు థియరీ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించారు. పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్ పర్యవేక్షించారు. ఈ కళాశాలకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2023 నవంబరు 13న యూజీసీ స్వయంప్రతిపత్తి హోదా కల్పించింది. 2024–25 నుంచి 2033–34 వరకు ఈ ప్రత్యేక హోదా కొనసాగనుంది. ఈ ప్రత్యేక హోదాతో కళాశాల మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రిన్సిపాల్ తెలిపారు.

పాటిపల్లిలో నేడు రెవెన్యూ సదస్సు

మునగపాక: మండలంలోని పాటిపల్లిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు జరగనుందని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రామాలయం వద్ద ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఈ సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అరబుపాలెం గ్రామాభివృద్ధికి సహకరించాలి



మాట్లాడుతున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అరబుపాలెం గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు కోరారు. మండలంలోని అరబుపాలెంలో గురువారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పాలకవర్గం పాటుపడుతుందన్నారు. ఇన్‌చార్జి కార్యదర్శి హరనాథ్, శరగడం యోగి నాగేశ్వరరావు, తదితరులు ఈ సభలో పాల్గొన్నారు.

- శిథిలావస్థలో గోపాలపట్నం ఆవ బ్రిడ్జి
- భయం భయంగా జనం రాకపోకలు
- ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి



శిథిల స్థితికి చేరిన గోపాలపట్నం ఆవ బ్రిడ్జి

ప్రమాదపుటంచున ఊగిసలాట.!

పాయకరావుపేట: మండలంలోని గోపాలపట్నం ఆవపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుని ప్రమాదపుటంచున ఊగిసలాడుతోంది. మండల ప్రధాన కేంద్రం పాయకరావుపేట నుంచి నిత్యం వందలాది వాహనాలు ఈ వంతెన మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెన శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సుమారు 55 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ వంతెనకు మరమ్మతులు చేపట్టి ఏళ్లు గడుస్తోంది. ప్రస్తుతం పెచ్చులూడిపోయి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. ఈ బ్రిడ్జి మీదుగా పెద్దిరాజుపాలెం, గోపాలపట్నం, పెంటకోట తీర ప్రాంతం, నక్కపల్లి మండలంలోని బంగారయ్యపేట, గునుపూడి, డీఎల్‌పురం గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి, పగలు తేడా లేకుండా ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు ప్రయాణాలు సాగిస్తుంటాయి. ఈ బ్రిడ్జికి రైలింగ్ ఇరువైపులా శిథిలమైపోయింది. దీంతో రాత్రి సమయంలో వాహనచోదకులు ఏమాత్రం అజాగ్రత్త వహించినా బ్రిడ్జిపై నుంచి కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామ ప్రజలు కోరుతున్నారు.

భయం భయంగా రాకపోకలు



ఆవపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితిలో ఉంది. ఇరువైపులా రైలింగ్ పూర్తిగా విరిగిపోయింది. రాత్రి పూట వంతెనపై రాకపోకలకు భయంగా ఉంటోంది. అధికారులు స్పందించి తక్షణం కొత్త బ్రిడ్జి నిర్మించాలి.

– గేదెల చినఅప్పలరాజు, పెంటకోట

రూ.5 కోట్లతో ప్రతిపాదనలు

గోపాలపట్నం ఆవపై బ్రిడ్జి శిథిలావస్థకు చేరిన విషయం మా దృష్టికి వచ్చింది. కొత్త వంతెన నిర్మాణానికి గతంలోనే రూ.5 కోట్ల ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే బ్రిడ్జి నిర్మాణం చేపడతాం.

–జ్ఞానేశ్వరరావు, మండల ఏఈ, రోడ్లు, భవనాల శాఖ

ప్రభుత్వ భూముల్లో సాగుదారులకు పరిహారం చెల్లించాలి



ఏపీఐఐసీ జెడ్ఎంకు వినతిపత్రం అందిస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

నక్కపల్లి: ఏపీఐఐసీ సేకరిస్తున్న ప్రభుత్వ భూముల్లో సాగు చేసుకుంటున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ హరిప్రసాద్‌ను పలువురు రైతులు కోరారు. ఈ మేరకు ఆయనను గురువారం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో రాజయ్యపేట, బుచ్చిరాజుపేట, చందనాడ, వేంపాడు, డీఎల్ పురం గ్రామాలకు చెందిన రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూసేకరణ చేపడుతున్న గ్రామాల్లో ప్రభుత్వ భూముల సాగు చేస్తున్న రైతులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ భూములు సాగుచేస్తూ జీవిస్తున్నారని, ఇప్పుడు పరిశ్రమల స్థాపన కోసం ఈ భూములు తీసుకుంటున్నారన్నారు. దీంతో వారంతా ఉపాధి కోల్పోతారన్నారు. అధికారులు సర్వేల పేరుతో కాలయాపన చేస్తూ కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారన్నారు. భూములు స్వాధీనం చేసుకుని మౌలిక సదుపాయాలు కల్పించే పనులు ప్రారంభించారని, సాగుదారుల విషయం మాత్రం పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సాగుదారులకు నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జెడ్ఎంను కలిసిన వారిలో సీపీఎం నాయకుడు రాజేష్, రైతులు బైరాగిరాజు, మాధవస్వామి, టి.ప్రసాద్, గోవింద్ తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఉత్సాహంగా మేలుకొలుపు



మూలపేట మేలుకొలుపులో భక్తులు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో మేలుకొలుపుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. యువకులు, పెద్దలు, పిల్లల మేలుకొలుపులో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వేకువజామునే నిద్రలేచి చన్నీటిస్నానమాచరించి గ్రామాల్లోని ఆలయాలకు వెళ్లి భజనలు చేస్తూ దేవతామూర్తులను నిద్రలేపుతూ గీతాలు ఆలపిస్తున్నారు. భోగి పండగ రోజుతో మేలుకొలుపు ముగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

చేతిబోరుకు శంకుస్థాపన



పాములవాకలో బోరు పనులను ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

కోటవురట్ల: పాములవాకలోని కూండ్రపు వారి గరువులో గురువారం బోరు పనులకు శంకుస్థాపన చేశారు. మాజీ సర్పంచ్ కిల్లాడ శ్రీనివాసరావు కొబ్బరికాయ కొట్టి బోరు పనులను ప్రారంభించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతుల మకాముల వద్ద మంచినీటి సమస్య ఉండడంతో గతంలో జెడ్పీటీసీ నిధులతో బోర్లు వేయించాలని కోరినట్టు తెలిపారు. నిధులు మంజూరు చేయడంతో బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు కె.చిన్నరామ్మూర్తినాయుడు, రైతులు కిల్లాడ రామకృష్ణ, కూండ్రపు దేముడు, కూండ్రపు నరసింహమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం



రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు

మునగపాక: రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ శేషుబాబు అన్నారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతుల భూములకు సంబంధించి తేడాలున్నా వాటిని సరి చేసేందుకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వీఆర్వో సురేష్, ఇన్‌చార్జి ఆర్ఐ పడాల్, రైతులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

వెంకన్నకు పల్లకీ సేవ



పల్లకీలో వెంకన్న స్వామిని ఊరేగిస్తున్న అర్చకులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం ఉపమాక వేంకటేశ్వర స్వామివారిని పల్లకిలో ఉంచి తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు, ఉత్సవ మూర్తులకు, గోదాదేవి అమ్మవారికి, వేణుగోపాల స్వామికి నిత్య పూజలు నిర్వహించిన తర్వాత పల్లకీలో ఉభయ దేవేరులతో కూడిన స్వామివారిని ఉంచి ఊరేగించారు. అనంతరం గోదాదేవి అమ్మవారి సన్నిధిలో తిరుప్పావై ప్రవచనాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. తదుపరి తీర్థగోష్ఠి, ప్రసాద వినియోగం జరిగాయి.

గ్రామాల్లో సమస్యల ఏకరువు

- ఎంపీడీవో, తహసీల్దార్ గైర్హాజరుపై సభ్యుల అసంతృప్తి
- పాయకరావుపేట మండల సర్వసభ్య సమావేశం



సమావేశానికి హాజరైన సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో వర్మరాజు

పాయకరావుపేట: మండలంలోని గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని మండల పరిషత్ సభ్యులు అధికారులను కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఇసరపు పార్వతీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో నిర్వహించే కార్యక్రమాల సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు ఇవ్వడం లేదని మాసాహేబుపేట ఎంపీటీసీ సభ్యుడు కొంతం నరేష్ సమావేశం దృష్టికి తీసుకెళ్లారు. రైతులకు వ్యవసాయ పరికరాలు, సామగ్రి రాయితీపై సరఫరా చేస్తే తక్షణం సమాచారం అందించాలన్నారు. జల జీవన్ మిషన్ పనుల కోసం గ్రామాల్లో తవ్విన రోడ్లను ఇంత వరకు పూడ్చలేదన్నారు. మండల పరిషత్ సమావేశానికి ఎంపీడీవో, తహసీల్దార్ హాజరు కాకపోవడంపై నరేష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పొదుపు సంఘాల మహిళలకు సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని శ్రీరాంపురం, గోపాలపట్నం సర్పంచ్‌లు కోరారు. మండలంలో పలు ఆర్‌అండ్‌బీ రోడ్లలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలన్నారు. రహదారులను ఆక్రమించి షాపులు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పలువురు సభ్యులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గోపాలపట్నం అంగన్‌వాడీ కేంద్రం వద్ద వేసిన గడ్డివామును తక్షణం తొలగించాలన్నారు. శ్రీరాంపురం రోడ్డులో నిత్యం నాటుసారా, గంజాయి రవాణా జరుగుతుందన్నారు. వీటి నివారణకు శ్రీరాంపురంలో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలన్నారు. దమ్ము, దుక్కి చేసేందుకు ఇనుప బ్లేడ్లతో వెళ్తున్న ట్రాక్టర్ల కారణంగా రోడ్లు ధ్వంసం అవుతున్నాయన్నారు. మండలంలో అటవీ భూముల్లోను, సముద్ర తీరం వెంబడి ఉన్న జీడి తోటల్లో సముద్రం ఇసుకను యథేచ్ఛగా తవ్వకాలు సాగిస్తున్నారని, అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాయలం ఈవో వర్మరాజు మాట్లాడుతూ సభ్యులు చెప్పిన గ్రామాల్లోని సమస్యలను దశల వారీగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

అనకాపల్లి: ట్రాన్స్‌పోర్టు డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఈనెల 5న జిల్లా సదస్సు నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు తెలిపారు. జాతీయ రహదారి పూడిమడక జంక్షన్ వద్ద సంక్షేమ బోర్డు కరపత్రాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భారత న్యాయ సంహిత చట్టం వల్ల రానున్న రోజుల్లో డ్రైవర్ల వృత్తి ప్రమాదంలో పడుతుందన్నారు. అనివార్య కారణాల వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్లను పూర్తి బాధ్యులను చేసి శిక్ష పడేలా చట్టాలుంటాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహదారులు అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు వాహన డ్రైవర్లపై చర్యలు తీసుకోవడం అన్యాయమన్నారు. ఆర్టీవో కార్యాలయంలో జరగాల్సిన లైసెన్స్‌లు, వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల జారీ ప్రక్రియలను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించడం అన్యాయమన్నారు. దీనిపై ప్రభుత్వాలు పునరాలోచన చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకుడు పలకా సత్యనారాయణ, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అక్రమాలపై విచారణ



కృష్ణాపురంలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి విచారణ జరుపుతున్న ప్రత్యేకాధికారి నాగరాజారావు



నక్కపల్లి మండలంలో లబ్ధిదారులను విచారిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: మండలంలో సామాజిక భద్రత పింఛన్ల పంపిణీలో అక్రమాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదులపై మండల ప్రత్యేకాధికారి జి.నాగరాజారావు గురువారం విచారణ చేపట్టారు. కృష్ణాపురం, జంపపాలెం, రేగుపాలెం, బయ్యవరం గ్రామాల్లో ఫిర్యాదు చేసిన లబ్ధిదారుల ఇళ్లకు ఆయన అధికారులతో కలిసి వెళ్లారు. ప్రతి నెలా జరుగుతున్న పింఛన్ల పంపిణీకి సంబంధించి లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ఫోన్ కాల్స్ పంపించి అభిప్రాయాలు తీసుకుంటోంది. ఈ సందర్భంగా ఐదుగురు లబ్ధిదారులు పింఛన్ల పంపిణీ సమయంలో ఉద్యోగులు తమ వద్ద నుంచి కొంత మొత్తం లంచంగా అడుగుతున్నారని ఫిర్యాదు చేశారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ప్రత్యేకాధికారి ఐదుగురు లబ్ధిదారుల వద్దకు వెళ్లి వారి వాంగ్మూలాలను నమోదు చేశారు. విచారణ నివేదికను ప్రభుత్వానికి పంపించనున్నట్టు అధికారులు తెలిపారు. ఎంపీడీవో కొండలరావు, డిప్యూటీ తహసీల్దార్ వినయ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయం ఏవో ప్రసాదరావు, సచివాలయ సిబ్బంది ప్రత్యేకాధికారి వెంట ఉన్నారు.

గ్రామాల్లో పింఛన్ల పరిశీలన పూర్తి

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి సంబంధించి వచ్చిన ఫిర్యాదులపై మండల స్థాయి అధికారులు గురువారం విచారణ జరిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో సచివాలయం సిబ్బంది డబ్బులు ఏమైనా వసూలు చేస్తున్నారా? అనే విషయంపై ప్రభుత్వం ఐవీఆర్ఎస్ ద్వారా విచారణ నిర్వహించింది. ఈ విచారణలో మండలంలో వేంపాడు, ఉద్దండపురం, రాజయ్యపేట, కాగిత, పెదతీనార్ల, గుల్లిపాడు, దొంకాడ, అమలాపురం, చినదొడ్డిగల్లు తదితర గ్రామాల్లోని లబ్ధిదారులు తమ వద్ద డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పడంతో ప్రభుత్వం ఈ గ్రామాల్లో విచారణ చేయాలని ఆదేశించింది. దీంతో తహసీల్దార్ నర్సింహమూర్తి, ఎంపీడీవో సీతారామరాజు తదితరులు స్వయంగా ఆయా గ్రామాల్లో ఐవీఆర్ఎస్ ద్వారా ఫిర్యాదులు వెళ్లిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి విచారణ నిర్వహించారు. తాము ఎటువంటి ఫిర్యాదులు చేయలేదని, సిబ్బంది ఎవరూ తమ దగ్గర డబ్బులు వసూలు చేయలేదని లబ్ధిదారులు చెప్పారని ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు.

పాయకరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక పింఛన్ల లబ్ధిదారులను విచారించినట్టు ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు తెలిపారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు 15 పంచాయతీల్లో పర్యటించి 32 మంది లబ్ధిదారులను విచారించామన్నారు. పింఛన్ల పంపిణీ సక్రమంగా జరిగినట్లు విచారణలో తేలిందన్నారు. మండల ప్రత్యేక అధికారి జి.వి.లక్ష్మి, తహసీల్దార్ జి.సత్యనారాయణ, ఈవోఆర్డీ సిహెచ్.చంద్రశేఖర్, ఆయా గ్రామాల సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మునగపాక: పింఛన్ల పంపిణీ ప్రక్రియ సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు తెలిపారు. మండల వ్యాప్తంగా 27 మంది పింఛన్ లబ్ధిదారులను అధికారుల బృందం గురువారం కలిసింది. మునగపాక పంచాయతీ పరిధిలోని ముగ్గురు లబ్ధిదారుల నుంచి పలు వివరాలను ప్రభాకరరావు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రూ.4వేల పింఛన్‌కు సంబంధించి ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉషారాణి, ఈవోఆర్డీ సోమరాజు, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా అపరాల సాగు



మండలంలో సాగవుతున్న అపరాల పంట

ఎస్.రాయవరం: అపరాల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం సాధారణంకు మించి చేపట్టారు. ప్రస్తుతం దాదాపు అదే స్థాయిలో అపరాల సాగు కూడా చేశారు. వరి కోతలు చేపట్టే ముందు మినుము, పెసర, బొబ్బరి విత్తనాలు చల్లి రబీ సాగుకు సిద్ధమయ్యారు. ఈ ఏడాది వరి 8 వేల ఎకరాల్లో సాగు చేయగా.. అపరాల సాగు సుమారు 6 వేల ఎకరాల్లో చేశారు. గడిచిన వారంలో వరుస తుపాన్ల సమయంలో వరి పొలాల్లో చల్లిన అపరాల విత్తనాలకు కొంత మేర నష్టం వాటిల్లింది. అయినప్పటికీ రైతులు మరో మారు విత్తనాలు చల్లుకుని సాగుకు సన్నద్ధమయ్యారు. ఈ ఏడాది వరుస తుపాన్ల కారణంగా పొలాలు నీటి చెమ్మతో ఉండడంతో అన్ని ప్రాంతాల్లో అపరాల సాగుకు వాతావరణం అనుకూలించింది. మండలంలో 22 రైతు భరోసా కేంద్రాల్లో 132 క్వింటాళ్ల విత్తనాలు పంపిణీ చేశారు. రైతులు తాము భద్రపరచుకున్న సుమారు 6 క్వింటాళ్ల బొబ్బర్లను పొలం గట్లపై నాటి సాగు చేస్తున్నారు. నెల రోజులు ముందుగా నాటడంతో బొబ్బర పాదులు ఆశాజనకంగా ఎదిగాయి. లోతట్టు ప్రాంతాల్లో ఇలా చల్లిన మొక్కలు కూడా దెబ్బతిన్నాయని రైతులు చెబుతున్నారు.

రెండున్నర నెలల్లో చేతికి పంట



వరి కోతలు చేసే ముందు అపరాలు సాగు చేయడం ఆనవాయితీ. అపరాలు సాగుకు నీటి సమస్య ఉండదు. రెండున్నర నెలల వ్యవధిలో చేతికొచ్చే మినుము, పెసర, బొబ్బరి సాగు చేపట్టాం. ఇటీవల వర్షాలు తరచూ పడడంతో ఆలస్యంగా విత్తనాలు చల్లాం. ప్రస్తుతం పంట ఆశాజనకంగా ఉంది.

– దుబాసి సాయికృష్ణ, రైతు, గెడ్డపాలెం, ఎస్.రాయవరం మండలం

ఆర్‌బీకేల్లో విత్తనాల సరఫరా



వరి కోతలు ప్రారంభ నుంచి గ్రామాలకు అందుబాటులో ఉన్న రైతు భరోసా కేంద్రాల నుంచి అపరాల విత్తనాలు సరఫరా చేశాం. వరి సాగు చేసిన రైతులు అందరూ అపరాలు సాగు చేశారు. వర్షాల వల్ల కాస్త ఇబ్బందులు ఎదురయ్యాయి. ప్రస్తుతం అపరాల పంటలకు చీడపీడలు బెడద లేదు.

– సౌజన్య, మండల వ్యవసాయాధికారి, ఎస్.రాయవరం మండలం

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

యలమంచిలి రూరల్: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు కోసం యలమంచిలి రైతు సేవా కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం ప్రారంభించారు. రైతులు సాగు చేసి ఉత్పత్తి చేసిన ధాన్యపు రాసులను దళారీ వ్యవస్థ లేకుండా కచ్చితమైన మద్దతు ధరకు అమ్ముకునేందుకు వీలుగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, వీటిని రైతులు సద్వినియోగపర్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు. క్వింటా ధాన్యానికి రూ.2300, గ్రేడ్‌ఏ రకం ధాన్యం క్వింటాకు రూ.2320 చెల్లించనున్నట్టు అయన తెలిపారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కంటే క్వింటాలుకు రూ.117 అదనంగా ఇవ్వనున్నట్టు చెప్పారు. రైతులకు గోనె సంచులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి పాలిమేర మోహన్‌రావు చెప్పారు. వరి కంకుల నూర్పిడి చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, ఏఈవో దేముడు, కొక్కిరాపల్లి పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను పరిరక్షించాలి

మునగపాక: ప్రభుత్వ భూములను పరిరక్షించాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఆదేశించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం సాయంత్రం వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చే అర్జీలకు సత్వర సమాధానం అందించాలన్నారు. ఎక్కడైనా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తుంటే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. డీటీ శేషుబాబు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలం

అనకాపల్లి: అన్నం పెట్టే రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, గత ఏడాది నవంబర్, డిసెంబర్ మాసాల్లో తుపాన్ల కారణంగా చేతికొచ్చిన వరి పంటకు తీవ్ర నష్టం జరిగిందని ప్రజా రాజకీయ వేదిక, రైతు స్వరాజ్య వేదిక, ఏపీ రైతు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆర్డీవో షేక్ ఆయూషాకు గురువారం సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టారని, నాయకులు సార్వత్రిక ఎన్నికల సమయంలో రైతుల పెట్టుబడికి కొంత నగదు అందజేస్తామని చెప్పి నేటికీ చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. రైతులను ప్రభుత్వాలు ఆదుకోనట్లయితే రానున్న రోజుల్లో రైతులు లేకుండా పోతారన్నారు. రైతు సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు సంఘాల నాయకులు కనిసెట్టి సురేష్‌బాబు, గాడి బాలు, కోరిబిల్లి శంకరరావు, కోన లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.